ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
నిజామాబాద్ జిల్లా వార్తలు
3
సోమవారం 17 జూన్ 2024



నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

ఖిల్లా, జూన్ 16: బక్రీద్ పండుగను పురస్కరించుకొని నగరంలో సోమవారం ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. ఖిల్లా ఈద్గా, బోధన్ బస్టాండ్, పూలాంగ్ ఈద్గాలలో పండుగ ప్రార్థనలు చేయడం జరుగుతుందని దానిని దృష్టిలో పెట్టుకొని బోధన్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఉదయం 6గంటల నుంచి 12గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లించడం జరిగిందన్నారు. బోధన్‌వైపు వెళ్లే వారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఫైటర్ బ్రిడ్జి, శివాజీచౌక్, నిజాంకాలనీ, అర్సపల్లి మీదుగా బోధన్‌కు వెళ్లాలని సూచించారు.



నగరంలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

నేడు బక్రీద్

నిజామాబాద్ అర్బన్, జూన్ 16: ముస్లింలు అతి పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగను సోమవారం జరుపుకోనున్నారు. అల్లా ఆదేశాల ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి తీసుకువెళ్లే సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ పండుగను జరుపుకుంటారు. రంజాన్ పండుగ తర్వాత అతి ముఖ్యమైన పండుగ కావడంతో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అల్లా పేరుతో ధాన ధర్మాలు చేస్తారు. మజీద్‌లలో ప్రార్థనలు నిర్వహించి సంవత్సర కాలం పాటు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ముస్లింలు భావిస్తారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్‌ను జరుపుకుంటారు. ఈ మేరకు బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మజీద్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని కచ్చియా మజీద్, ఖిల్లా ఈద్గా తదితర ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు..


బక్రీద్ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సహాలతో జరుపుకోవాలని కలెక్టర్ కోరారు.


బక్రీద్ సందర్భంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

సుభాష్‌నగర్: బక్రీద్ సందర్భంగా సమస్యల పరిష్కారం కోసం 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మందమకరంద్ తెలిపారు. అన్ని మజీద్‌ల వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. సరిపడా తాగునీరు అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. నగరం మొత్తంలో సరైన పారిశుధ్యం పరిశుభ్రత నిర్వహణ, జంతువుల వృధాచెత్తను ఎత్తిపోయాలన్నారు. అధికారులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు ఉంటాయన్నారు. సమస్యల కోసం ప్రజలు 08462-221001 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.



ఫీ జులుం





- ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల మోత
- భారీగా పెరిగిన ప్రైవేట్ పాఠశాలల ఫీజులు
- గత యేడాదికంటే 20శాతం పెరిగిన పుస్తకాల రేట్లు
- డొనేషన్‌ల పేరుతో యథేచ్ఛగా వసూళ్లు
- జూన్ వచ్చిందంటే బెంబేలెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 16: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సామాన్యులు చదవడం భారంగానే అవుతోంది. తమ పిల్లలకు మంచి చదువులు చదివించాలనుకునే తల్లిదండ్రులకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఉన్న ఫీజులను చూసి బెంబేలెత్తిపోయే పరిస్థితులు ఉన్నాయంటే ఫీజులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. నర్సరీ చదివించాలంటే లక్షల్లో ఫీజులు కట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయంటే ప్రైవేటులో ఫీజుల దోపిడీ ఏ విధంగా జరుగుతుందో అర్థమవుతోంది. దానికితోడు పుస్తకాలు, డ్రెస్సులు, బ్యాగులు ఇలా ప్రతిదీ ఆ స్కూళ్లలోనే తీసుకోవాల్సి ఉండటంతో జూన్ నెల వచ్చిందంటే చాలు అమ్మో ఇదేం భారమనే పరిస్థితి సామాన్యులకు ఏర్పడుతోంది.



ఇష్టారీతిన వసూళ్లు..

విద్య వ్యాపారంగా మారడంతో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారీతిన ఫీజులను వసూళ్లు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలనే ఆకాంక్షను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందంటే చాలు తల్లిదండ్రులు భయపడే పరిస్థితులు ఉన్నాయి. ఫీజులకు తోడు యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, బస్ ఫీజులు అంటూ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఫోన్‌లు వస్తే చాలు ఏం మాట్లాడాలో తెలియని అయోమయ పరిస్థితిలో తల్లిదండ్రులు ఉంటున్నారు. జూన్ వస్తుందంటే చాలు ముందస్తుగానే ఖర్చులు తగ్గించుకుని పిల్లల చదువు కోసం జమచేసుకున్న డబ్బులను ఖర్చుపెట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గత విద్యాసంవత్సరం కంటే ఈ విద్యాసంవత్సరం 10 నుంచి 30శాతం వరకు ఫీజులను ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పెంచేయడంతో సామాన్య మధ్యతరగతి వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పుస్తకాలు, నోట్‌బుక్స్ రేట్లు గత యేడాది కంటే 20శాతం పెరగడంతో అవి కూడా తల్లిదండ్రులకు అదనపు భారంగా మారుతున్నాయి. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ పాఠశాలల్లో అడ్మిషన్‌ల కోసం డొనేషన్‌లు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు మాత్రం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజు దోపిడిని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. ప్రతి యేడాది ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు యదేచ్ఛగా దోపిడికి పాల్పడుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఇతర వసతుల పేరుతో..

జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నయా దోపిడికి శ్రీకారం చుట్టాయి. తమ వద్ద కొన్ని ప్రత్యేకమైన వసతులు, ప్రత్యేకమైన తరగతులు, కొత్తగా ఏసీ క్లాస్ రూమ్‌లు ఉంటాయని చెబుతూ తల్లిదండ్రుల నుంచి యథేచ్ఛగా ఫీజులు వసూలు చేస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు తప్పని పరిస్థితిలో ఫీజులను చెల్లిస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి తమ పిల్లలను చదివించలేని పరిస్థితిల్లో ఉన్న కుటుంబాలు ఇక్కడే స్థానికంగా ప్రైవేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. అదే అదునుగా భావిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఫీజులను పెంచేసి దోపిడికి పాల్పడుతున్నాయి. జిల్లాలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీ తరగతుల ఫీజులే లక్ష నుంచి 50వేల వరకు ఉన్నాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోంది. దీనికి తోడు నోట్ పుస్తకాలు, డ్రెస్సులు, బస్సు ఫీజులు అంటే తల్లిదండ్రులకు ప్రైవేట్ విద్యా అదనపు భారంగా మారుతుంది. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ పాఠశాలలు యధేచ్ఛగా ఫీజులను వసూలు చేస్తున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఫీజుల భారం తల్లిదండ్రులకు భారంగా మారింది.

పుస్తకాలు, నోట్ పుస్తకాల అమ్మకం..

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌పుస్తకాలు అమ్మవద్దని నిబంధనలు ఉన్న ప్రైవేట్ పాఠశాలలు తమ పాఠశాలల్లోనే పుస్తకాలను, నోట్‌బుక్‌లను బహిరంగంగా అమ్మకాలు చేస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. హోల్‌సేల్ రేట్లకు పుస్తకాలను, నోట్‌పుస్తకాలను కొనుగోలు చేస్తున్న పాఠశాలలు వాటిని ఎంఆర్‌పీ ధరలకు తల్లిదండ్రులకు విక్రయిస్తున్నారు. గత విద్యాసంవత్సరం ప్రతి తరగతికి 3 నుంచి 4 వేలు ఉన్న పుస్తకాల ధరలు ఈ విద్యాసంవత్సరం 6 నుంచి 7వేల వరకు పెరిగాయి. పాఠశాలలకు సంబంధించిన ఫీజుల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఎక్కడా కూడా ఏర్పాటు చేయడంలేదు. నోటీసు బోర్డులపై పాఠశాల ఫీజుతో పాటు పరీక్ష ఫీజును ప్రదర్శించాల్సి ఉన్న అవేమీ పట్టించుకోకుండానే ఇష్టారీతిన ఫీజులను వసూలు చేస్తున్నారు. నగరంలోని ఆర్మూర్ రోడ్‌లో ఉన్న ఓ పాఠశాల విద్యార్థుల ప్రవేశాలకు డొనేషన్‌లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నా- అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తి చూడడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉత్తర్వులు, ఆదేశాలను, విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్ పాఠశాలలు అమలు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు..

: దుర్గాప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలి. అధికంగా ఫీజులు వసూలు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే పాఠశాలల తనిఖీని నిర్వహిస్తాం. నిబంధనలకు అనుగుణంగా ఏ పాఠశాలలోను పుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్మడానికి వీలు లేదు. అలాంటివి జరిగితే తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.



మిషన్ భగీరథ అందుతోందా?

- జిల్లాలో మిషన్ భగీరథపై కొనసాగుతున్న సర్వే
- పది రోజుల పాటు ఇంటింటా నిర్వహణ
- పథకం అమలు తీరుపై ఆరా తీస్తున్న సిబ్బంది
- తాగునీటి సమస్య పరిష్కారమే సర్వే లక్ష్యం
- బోధన్ నియోజకవర్గంలో 54వేల నల్లా కనెక్షన్లు
- జిల్లా వ్యాప్తంగా లక్షా 90వేల నల్లా కనెక్షన్లు

బోధన్ రూరల్, జూన్ 16: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుందా?లేదా అని క్షేత్రస్థాయిలో సర్వే కొనసాగిస్తోంది. ప్రతి ఇంటా తాగునీరు అందించే విధంగా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వం లక్షల కోట్లు వెచ్చించి గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఈ పథకం కింద ట్యాంకులు నిర్మించి పైపులైన్‌లు వేసి ఇంటింటా నల్లాలను ఏర్పాటు చేసింది. ఒక్కో మనిషికి కనీసం వంద లీటర్ల నీటిని అందించేందుకు ప్రణాళికలు తయారు చేసింది. కానీ ఈ పథకం అమలులో క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వస్తున్నాయి. అనేక చోట్ల నల్లాలను అమర్చలేదు. కొన్ని ప్రాంతాల్లో గ్రామానికి దూరంగా ట్యాంకులను నిర్మించి నివాసాలకు పైపులైన్‌లు వేయకుండా వదిలేశారు. పాత పైపులైన్‌ల ద్వారానే తాగునీరు సరఫరా చేస్తున్నారు. పైపులైన్ లీకేజీలు అధికంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే రాష్ట్రంలో వందశాతం ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తున్నామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఇంటింటా మిషన్ భగీరథ నీరు అందడం లేదు. దీంతో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఇంటా తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాపై ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నెల 10న ప్రారంభమైన సర్వే పది రోజుల పాటు కలెక్టర్ నేతృత్వంలో కొనసాగనుంది. కాగా, బోధన్ నియోజకవర్గంలో 53,770 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 2.90 లక్షల నల్లా కనెక్షన్లు ఉన్నాయి.

సేకరణ యాప్‌లో వివరాల నమోదు

ఇంటింటా సర్వేకు గాను ఎంపిక చేసిన సిబ్బంది ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో కార్యదర్శి నేతృత్వంలో జరిగే ఈ సర్వేలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. భగీరథ నీటి సరఫరాకు నల్లా కనెక్షన్ ఉందా? నీళ్లు సక్రమంగా వస్తున్నాయా. పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయా, శుద్ధమైన నీరు అందుతుందా? నల్లా పని చేస్తుందా? నీళ్లు ఎన్ని రోజులకు వస్తున్నాయి. కుటుంబ సభ్యులకు సరిపోతున్నాయా వంటి 11 అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. అదే విధంగా కుటుంబ యజమాని పేరు, చిరుమానా, మొబైల్ నెంబర్, ఆధార్, ఇంటి నెంబర్ తీసుకుంటున్నారు. కుటుంబ యజమానితో పాటు ఇంటి ఫొటో, నల్లా ఫొటోను తీసుకుని ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.



బోధన్ డివిజన్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ఇంటింటికి నీరందించడమే లక్ష్యం

జిల్లాతో పాటు బోధన్ డివిజన్‌లోని ప్రతి ఇంటింటికీ తాగునీరు అందించే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక పకడ్బందీ చర్యలు చేపట్టింది. సర్వేలు నిర్వహించిన నిజమైన నల్లా కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి. కుటుంబాలు ఎన్ని ఉన్నాయి. మొత్తం వివరాలు సేకరించి తాగునీరు అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది.

బోధన్ డివిజన్‌లో సర్వే కొనసాగుతోంది..

: సాయిబాబా, డీఎల్‌పీవో బోధన్



మిషన్ భగీరథ పథకంపై బోధన్ డివిజన్‌లోని బోధన్, సాలూర, ఎడపల్లి, రెంజల్, నవీపేట, రుద్రూరు, కోటగిరి, వర్ని, మోస్రా తదితర అన్ని మండలాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాము. సర్వే కోసం ఎంపిక చేసిన ఉద్యోగులకు శిక్షణ ఇచ్చాం. వారితో పాటు మేము సైతం ఇంటింటికి వెళ్లి వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నాం. సర్వే పది రోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాం. క్షేత్రస్థాయిలో సర్వేను పక్కాగా నిర్వహించేలా చూస్తున్నాం. సర్వే ద్వారా గుర్తించిన సమస్యలు, అంశాలు ప్రభుత్వానికి నివేదిస్తాం.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి..

: మున్నీనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ

తాగునీటి సరఫరాలో లోపాలను సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఈ సర్వే దోహదపడుతుంది. జిల్లాతో పాటు బోధన్ డివిజన్‌లోని మిషన్ భగీరథ గ్రేడ్‌ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుంది. అయితే అందులో ఉన్న సమస్యలపై వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నాం. తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోంది.



కొత్త రేషన్ ఏదీ?

- నూతన రేషన్ కార్డుల కోసం పేదల ఎదురుచూపులు
- కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న అర్హులు
- కార్డుల్లో పేర్ల మార్పులు, చేర్పులకు అవరోధాలు
- రేషన్ కార్డుల మంజూరుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నిజామాబాద్ అర్బన్, జూన్ 16: పార్లమెంట్ ఎన్నికల కోడ్ తొలగడంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు మళ్లీ కొత్తగా ఆశలు రేకెత్తుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా కొత్త రేషన్ కార్డుల జారీకి సమయాత్తం అవుతుండటంతో కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు మళ్లీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మూడు రోజులుగా జిల్లాలోని మండల తహసీల్దార్ కార్యాలయాలకు అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చుకునే దిశగా ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. రేషన్ కార్డులు లేనివారు సైతం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం అవకాశం కల్పించింది. వేలాది మంది అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పటికీ కొత్త రేషన్ కార్డులు మాత్రం ఇంకా ప్రభుత్వం జారీ చేయలేదు. ఎన్నికల కోడ్ రావడంతో కొత్త రేషన్ కార్డులకు బ్రేక్ పడింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ ముగియడంతో మళ్లీ రేషన్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రేషన్ కార్డులు లేకపోవడంతో చాలా మంది పేదలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల అమలుకు సైతం రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో చాలా మంది ఆ పథకాలు పొంద లేకపోతున్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందాలన్న రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో చాలా మంది పేదలు అర్హులైనప్పటికీ వైద్య సేవలు పొందలేకపోతున్నారు. పదేళ్లుగా రేషన్ కార్డులలో కుటుంబ సభ్యులను చేర్చుకోవడం కొరకు రేషన్ కార్డుదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా రేషన్ కార్డులలో వారి పేర్లు చేర్చడం లేదు.

జిల్లాలో 3లక్షల 80వేల 48 ఆహార కార్డులు..

జిల్లాలో 3లక్షల 80వేల 48 ఆహార భద్రత కార్డుల ద్వారా ఇప్పటికే 12లక్షల 25,008 మంది లబ్ధిదారులకు అంత్యోదయ, అన్నపూర్ణ కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ అందజేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 759 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరకుల పంపిణి కొనసాగుతుంది. జిల్లాలో అంత్యోదయ కార్డులు 20961 ఉండగా 56వేల 922 మందికి, 1034 అన్నపూర్ణకార్డుల ద్వారా 1057 మంది లబ్దిదారులకు రేషన్ బియ్యం అందజేస్తున్నారు. వీరికి ప్రతి నెల ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు ఉచితంగా 10కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు ప్రతి నెల 35 కిలోల బియ్యాన్ని అందజేస్తున్నారు.

ఫ్యామిలీ మెంబర్ యాడింగ్ దరఖాస్తులు 95,414 పెండింగ్..

జిల్లాలో ప్రస్తుతం 3లక్షలకు పైగా ఉన్న రేషన్ కార్డులలో సవరణలు, కుటుంబ సభ్యులను చేర్చడానికి లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులు 95,414 పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డులు జారీ చేసిన కొత్తలో చిన్న పిల్లలు అంగన్‌వాడి కేంద్రాలకు వెళ్లడంతో వారికి ప్రభుత్వం ద్వారా సహాయం అందుతుం డటంతో వారి పేర్లను రేషన్ కార్డులలో చేర్చుకోలేదు. పిల్లలు 5 సంవత్సరాలు నిండిన తర్వాత రేషన్‌కార్డులలో యాడ్ చేస్తుండడంతో కార్డుదారులు వారికి సంబంధించిన పత్రాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉంది.

ఎదురుచూపులు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2014లో అప్పటి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే పేరుతో ఒకేరోజు సర్వే నిర్వహించి ఇంటింటి వివరాలను నమోదు చేసుకున్నప్పటికీ రేషన్ కార్డులను మాత్రం ఇవ్వలేదు. 2022లో కొంత మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను జారీ చేశారు. అవి కొంత మందికి మాత్రమే ఇచ్చారు. ప్రస్తుతం కుటుంబాలు పెరిగిపోయి విడిగా ఉంటున్న వారు, పెళ్లిళ్లు జరిగి వేరేకాపురం పెట్టిన వారు, కొత్తగా పుట్టిన పిల్లలు, కొంత మంది పిల్లల పేర్లు రేషన్ కార్డులో లేకపోవడం వీటన్నింటికి అవకాశం లేకపోవడంతో ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారు. ఆరు గ్యారంటీల అమలులో రేషన్ కార్డుల కీలకపాత్ర పోషిస్తున్నాయి. రేషన్ కార్డు ఉంటేనే ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు అర్హులుగా ప్రభు త్వం ప్రకటించిన నేపథ్యంలో ఈ మూడు నెలల కాలంలో కొత్త రేషన్ కార్డులు ప్రభుత్వం జారీ చేస్తే బాగుండేదని లబ్ధిదారులు అభిప్రాయపడుతున్నారు.

నష్టపోతున్న అర్హులు, విద్యార్థులు..

ప్రభుత్వం ఆరు గ్యారంటీ స్కీమ్‌లకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో చాలా మంది అర్హులు ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. గతంలో తొమ్మిదన్నర ఏళ్ల పాటు కొనసాగిన బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీలో నిర్లక్ష్యం చేసింది. కేవలం ఒకసారి మాత్రమే రేషన్ కార్డులను జారీ చేయగా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఎవరికీ రేషన్ కార్డులను ఇవ్వలేదు. తొమ్మిదేళ్ల కాలంలో అనేక కుటుంబాలలో పిల్లలకు పెళ్లిళ్లు జరిగి వేరే కాపురాలు పెట్టినప్పటికీ వారికి రేషన్ కార్డులు అందలేదు. ఆడపిల్లలకు పెళ్లిళ్లు జరిగి అంతవారి ఇంటికి వెళ్లినప్పటికీ ఇక్కడ పుట్టినింట్లో ఉన్న రేషన్ కార్డులలో పేర్లు తొలగించారు. అత్తవారి ఇంట్లో వారి పేర్లను నమోదు చేయడంలో మాత్రం ఆలస్యం జరుగుతోంది. ఐదేళ్లుగా రేషన్ కార్డుల్లో కొత్తవారి పేర్ల నమోదు జరగడం లేదు. విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఇతరత్ర సర్టిఫికెట్లు పొందాలంటే రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో వారు కూడా ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు.





రత్నాపూర్ మల్లన్నకు ప్రత్యేక పూజలు

● ఐదేళ్లకు తేలిన ఆలయం



రత్నాపూర్ మల్లన్నస్వామి ఆలయ ముఖద్వారం

ముప్కాల్, జూన్ 16: ఉత్తర తెలంగాణ జిల్లాల వరప్రదాయిని శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు నిర్మాణంలో నీట మునిగిన గ్రామ రత్నాపూర్ మల్లన్నకు ఆది వారం భక్తులు పోటె త్తారు. ఐదేళ్ల తర్వాత ప్రాజెక్టు నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో మల్లన్న గుడిఆలయం తేలింది. దీంతో ప్రతీ ఆదివారం మల్లన్నకు నైవేద్యాలు సమర్పిస్తూ వనబోజనాలు చేస్తున్నారు. ఆలయంలో భక్తులు నైవేద్యాలు సమర్పించి వనభో జనాలు చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వసతులు కల్పించాలని దాతలను కోరుతున్నారు. అప్పట్లో 91గ్రామాలు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురై ఇతర ప్రాంతాల్లో ప్రభ ుత్వం వారికి పునరావాసం కల్పించింది. ప్రాజెక్టులో నీరు డెడ్ స్టోరేజీకు చేరడంతో రోడ్డు గుండా వాహనాల ద్వారా తరలివెళ్తున్నాయి. అంతకు ముందు నీటిలో కాలినకడన వెళ్ళి మల్లన్నకు పూజలు చేశారు. ముంపు గ్రామాల ప్రజల వచ్చి మల్ల న్నకు ప్రాజెక్టు నీటిలో స్నానాలు చేసి బోనాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గుట్ట ఆధునీకరణ కోసం భక్తులు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం నీరు తగ్గి గుట్టకు భక్తులతా కిడి పెరిగుతున్నట్లు అభి వృద్ధికి ముందుకు వస్తు న్నారు. పాత రత్నాపూ ర్‌కు చెందిన భూమన్న బావి ఆధునీకరణ కోసం ముందుకు వచ్చారు. భక్తుల సాయంతో గుట్టపై సీసీ, ఆలయ అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు.



ఆలయంలో నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు













అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి
- అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు
- 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కొశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఎస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'ఛలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు ఛలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న ఛలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌వోఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే ఛలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

- 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

- వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ పర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

ఏర్గట్లలో యథేచ్ఛగా ఇసుక అక్రమ దందా



తొర్తిలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక (ఫైల్)

ఏర్గట్ల, జూన్ 16: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. మండలంలో ఏ గ్రామంలో కూడా ఇసుక తీసుకోవడానికి అనుమతులు లేవు. ఇదే అదునుగా భావించిన ఇసుకాసురులు అధికారుల కళ్ళు కప్పి అక్రమంగా ఇసుక తరలిస్తూ లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. అర్ధరాత్రిల్లో ట్రాక్టర్‌లతో పాటు లారీల్లో ఇసుకను పలు చోట్లకు తరళించి డంప్ చేసుకొని దూర ప్రాంతాలకు తరళిస్తున్నారు. అయితే గుమ్మిర్యాల్ గ్రామంలో ఇటీవలే అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్ వెంటనే గ్రామానికి వెళ్ళి అక్రమంగా తరళిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేయగా గత రెండు రోజుల క్రితం తొర్తి గ్రామంలో 15 ట్రాక్టర్‌ల ఇసుకను సీజ్ రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఏదేమైన అటు రెవెన్యూ ఇటు పోలీసు అధికారు లను లెక్క చేయకుండా ఇసుకాసురులు అక్రమ ఇసుక దందా పాల్పడటం, జిల్లాకు మారు మూల మండలం కావడంతో, జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉండటం వల్లనే ఇలాంటి అక్రమా దందాలకు పాల్పడుతున్నట్లు వినికిడి.

అనుమతులు లేవు..

మహమ్మద్ యూసుఫ్ తహసీల్దార్, ఏర్గట్ల

మండలంలో ఇసుక తీసుకోవడానికి ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా గ్రామాల్లో ఇసుక తరళించినట్లు సమాచారం అందిస్తే ఇసుకను సీజ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.



గుమ్మిర్యాల్‌లో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న తహసీల్దార్ (ఫైల్)

అధ్వానంగా తెలంగాణ యూనివర్సిటీ శిలాఫలకం



పెచ్చులూడిన టీయూ శిలాఫలకం

డిచ్‌పల్లి,జూన్ 16: పదేళ్ల క్రితం జాతీయ రహదారి పక్కన ప్రారంభించిన శిలఫలకం పెచ్చులూడిపోయి అధ్వానంగా తయారైంది. ఇది వరకు శిలాఫలకానికి చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ కంచె అగ్నికి ఆహుతి అయింది. యూనివర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాల్సిన శిలాఫలకం అధికారుల పర్యవేక్షణ లోపంతో అమాత్యుల పేర్లు ఊడిపోయి కళవీహీనంగా మారింది. ప్రభుత్వ పాలకులు పునరుద్ధరించి వర్సిటీ స్వాగత తోరణం వద్ద ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు

ఆత్మీయ సమ్మేళనాలు



మోస్రాలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఆర్డీవో



పాల్గొన్న పూర్వవిద్యార్థులు



హసకొత్తూర్‌లో ..

మోస్రా, జూన్16: మండల కేంద్రంలోని మోటాడి రెడ్డి కల్యాణ మండపంలో జిల్లా పరిషత్ మోస్రా 1990-91 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో చేసిన చిలిపి అల్లరి, ఆనాటి ఆట, పాటలు గుర్తుకు చేసుకొని ఆనందించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న వృత్తి ఉద్యోగం చెప్పుకుంటూ తమ కుటుంబ సభ్యులను మిత్రుల అందరికి పరిచయం చేశారు. తమ విద్యార్థులు చేస్తున్న ఉద్యోగం పలువురి బిజినెస్‌లపై వారిని అభినందించారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004-05 విద్యాసంవత్సర పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత ఒక చోట కలుసుకుని గెట్టుగెదరు కార్యక్రమాన్ని ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగ వివిద ప్రాంతాలలో వివిద వృతులు, వ్యాపారాలు, ఉద్యోగులు స్థిరపడిన పూర్వ విద్యార్థులు, విద్యార్థినిలు మంగళవారం హసాకొత్తూర్ చేరుకున్నారు 20 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకున్నవీరు ఒకరినొకరు ఆప్యాయంగ పలుకరించుకుంటు యోగక్షేమాలు, ప్రస్తుత వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధలు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువలు, జ్ఞాపికలతో సన్మానించుకుని వారి ఆశిర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకు వెళ్లి తరగతగదిలో కూర్చొని గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంత అనందడోలికల్లో మునిగి తేలారు. పూర్వ విద్యార్థు అపూర్వ సమ్మేళనంలో అప్పటి ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, ఉపాధ్యాయులు గంగాధర్, రంగాచారి, శ్రీనివాస మూర్తి, పూర్వవిద్యార్థినిలు విద్యార్థులు పాల్గొన్నారు. బోధన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు కలుసుకుని తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. 1986-87కు చెందిన పదవ తరగతి విద్యార్థుల బ్యాచ్ ఒకరునొకరు పలకరించుకుంటూ ఆనాటి చిన్ననాటి గుర్తులను నెమరు వేసుకున్నారు. తమ గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పురాణే అజయ్ కుమార్, ఉమాకాంత్, శివాజీ, కర్నె శ్రీనివాస్‌లతో తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2013-14లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంత ఒక చోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. అనంతరం అనాటి గురువులను పూర్వవిద్యార్థులు సన్మానించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం ఫత్తేపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-01విద్యాసంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23ఏళ్ళ తర్వాత కలుసుకున్న వారు అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు గడ్డం అవినాష్, భూపతిరెడ్డి, గంగాధర్, విద్యాసాగర్, రవి, రాజేందర్, నందన, సుజాత, రాగిని, మంజుల పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల పరిధి మామిడిపల్లి శివారులోని మైత్రి గార్డెన్‌లో ఆగివారం గోవింద్‌పేట్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996-97 విద్య సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువు లు రాంరెడ్డి, నీరజ్, రాజేశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డిలను ఘనంగా సన్మానించారు.



ఫత్తేపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులతో పూర్వవిద్యార్థులు



గోవింద్‌పేట్‌లో ..

విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

ఇందల్వాయి, జూన్ 16: ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, గన్నారం, ఇందల్వాయి, నల్లవెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఈనెల 17 నుంచి విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించబడుతున్నందున ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణి కార్యక్రమంలో నమోదు చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోటగిరి: విద్యుత్ సమస్యలపై ప్రతి సోమవారం తలపెట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. కోటగిరి సబ్ స్టేషన్‌లో సోమవారం 10నుండి 1గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని ఆయన తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటలకు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నందిపేట: మండల కేంద్రంలోని 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్, ఈఆర్‌వో ఆఫీస్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడీఈ కోరారు. వినియోగదాలు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావా ణిలో విన్నవించుకోవాలని, సమస్యకు సత్వరమే పరిష్కారం దొరు కుందని తెలిపారు. ప్రజావాణి ప్రతీ సోమవారం నిర్వ హించబ డుతుందని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ పేర్కోన్నారు.

డిచ్‌పల్లి: విద్యుత్ శాఖ సబ్‌డివిజన్, ఈఆర్‌వో, డివిజన్ కార్యాలయాలల్లో ప్రజావాణి కార్యక్రమాన్నినిర్వహిస్తున్నట్లు డీఈ ఉత్తమ్ జాడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బక్రీద్ సందర్భంగా సెలవు ఉన్న ప్రజావాణి కార్యక్రమం మాత్రం కొనసాగుతుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో వివరించారు.

ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఎంపీని కలిసిన ఎమ్మెల్యే

ఆర్మూర్ రూరల్, జూన్16: నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలుపొందిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను ఆది వారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్మూర్ ప్రాంతంలో ఫుడ్ పార్క్ పరిశ్రమల ఏర్పాటు, నవోదయ పాఠశాలలు కేంద్రం నుంచి మంజూరయ్యేలా చూడాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఎంపీ అర్వింద్‌ను కోరారు. కేంద్రం నుంచి ఆర్మూర్ నియోజకవర్గానికి అత్యధిక నిధులు వచ్చేలా తనవంతు కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు.

సిర్పూర్‌లో ముత్యాలమ్మ పండుగ

మోపాల్, జూన్ 16: ప్రజలు, రైతులు పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ప్రతి సంవత్సరం ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ గ్రామాభివృద్ధి ప్రతినిధులు తెలిపారు. ఆదివారం మండలంలోని సిర్పూర్ గ్రామంలో పెద్దఎత్తున ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద నుంచి బోనాలతో మహిళలు ముత్యాలమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు పెద్దవెంకట్, రెంజర్ల బొడ్డు నరేష్, గంగారెడ్డి, రాజు, వడ్ల రఘు, ఎర్రన్నలతో పాటు వీడీసీ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మామిడిపల్లిలో ఘనంగా ఊర పండగ...

పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఊరపండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు నైవేద్యాలు సమర్పించి వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పడి ప్రజలందరు సుఖసంతోషాలతో ఉం డాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్‌లు, కులసం ఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా గోదావరి నుంచి గంగాజలాలు తీసుకువచ్చి పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ ఏటా నిర్వహించే బోనాల కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం కూడా నిర్వహించినట్లు పేర్కొన్నారు. పెద్దమ్మతల్లి ఆశీర్వాదంతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు ప్రజలందరు కూడా సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. అనంతరం పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీనిధి, వర్షిత, విద్యార్థులను మెమోంటో, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భూమేష్ నరేష్, సత్యనారాయణ, భూషణ్, మోహన్, గణేష్, దిలిప్, రమేష్‌లు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండలంలోని నికల్‌పూర్ గ్రామంలో మహాలక్ష్మీ అమ్మవారికి గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది బోనాలు, నైవేద్యాలు సమర్పిస్తారు. వర్షాకాలం పంటలు ప్రారంభమయ్యే సమయంలో మహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం నైవేద్యాలు సమర్పించి పంటలు మొదలుపెడతారు. పాడి పంటలు, పిల్లపాపలు చల్లగా ఉండాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్‌కు అవార్డుల పంట

సుభాష్‌నగర్, జూన్ 16: రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్‌కు అవార్డుల పంట పండింది. ఆదివారం రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం నిర్వహించిన 2023-24 అవార్డుల కార్యక్రమంలో నిజామాబాద్ రీజియన్‌కు ఉత్తమ అధ్యక్షుడిగా భూలోకం విజయ్‌కాంత్‌రావు ఎంపికయ్యారు. నిజామాబాద్‌లో చేసిన పర్యావరణం, ఆరోగ్య శిబిరాలు, సామాజిక రంగం వివిధ అంశాలపై చేసిన కృషికి ఉత్తమ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ జిల్లాలో చేసిన సేవలను గుర్తించి అవార్డు అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ అసిస్టెంట్ గవర్నర్ శ్రీనివాస్, కార్యదర్శి వీర బ్రహ్మం, పట్వారి గోపికృష్ణ, తులసీ, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకాలనీలో శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, జూన్16:పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం నిర్వహించారు. ఈ సం దర్భంగా కాలనీలోని ప్రధాన రోడ్లకు ఇరువైపుల ఏపుగా పెరిగిన పిచ్చిమొ క్కలను, చెత్తచెదారాన్ని తొలగించారు. అడ్డదిడ్డంగా పెరిగిన చెట్ల కొమ్మలను నరికివేశారు. డ్రైనేజీలో చెత్తచెదరం చేరడంతో డ్రైనేజీలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్, ఉపాధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, కోశాధికారి సత్యనారాయణగౌడ్, కొక్కెర భూమన్న, ఎల్.సాయన్న, గణేష్, ఎర్ర భూమయ్య, ఎల్‌టి.కుమార్, భాజన్న, ఎస్‌కే.బబ్లు, కృషివర్ధన్ పాల్గొన్నారు.

చివరి దశకు ఉపాధ్యాయుల బదిలీలు

● తమకు అన్యాయం జరుగుతుందని సీఎంను కలిసిన ఎస్జీటీలు



హైదరాబాద్ వెళ్లిన జిల్లా ఎస్జీటీ నాయకులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 16: విద్యాశాఖలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చివరిదశకు చేరింది. పండిత్, పీఈటీలు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ప్రక్రియకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి కాగా సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పదోన్నతులకు సంబంధించిన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం ముగిసింది. ఎడిట్ ఆప్షన్‌లు సైతం ప్రారంభం కావడంతో ఒకటి రెండు రోజుల్లో పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులు రానున్నాయి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు గా పదోన్నతులు ఇస్తూ అందుబాటులో సీనియారిటీ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. తాత్కాలిక సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపర్చి 10, 11 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించారు. 13న నాట్ విల్లింగ్ ఆప్షన్ చూసి 14న ఫైనల్ సీనియారిటీ జాబితాను ఉన్నతాధికారులకు పం పించారు. జిల్లాలో ఉన్న ఖాళీల మేరకు స్కూల్ అసిస్టెంట్లు ఆయా సబ్జెక్టుల వారిగా వెబ్‌ఆప్షన్‌లు ఇచ్చిన తర్వాత తమకు అనుకూలంగా ఆప్షన్ పెట్టుకున్న చోటికి బదిలీ అయ్యే అవకాశం ఉంటుంది. బదిలీ ల అనంతరం పదోన్నతులు కల్పించి పోస్టింగ్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఎంతోకాలంగా పండిత్, పీఈటీలు పదోన్నతుల కో సం ఎదురు చూస్తున్న ప్రక్రియ ముగియనుంది. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలలో ఎస్జీటీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్జీటీలు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సరైన అర్హతలు ఉండి 11, 12 జీవోల ప్రకారం పదోన్నతులు కల్పించాల్సిన ప్రభుత్వం అధికారులు, ఎమ్మెల్సీలు, సం ఘాల నాయకుల తప్పుడు వివరణలతో కేవలం ఉపాధ్యాయ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఓటు హక్కు ఉన్న పండిత్, పీఈ టీలకే అన్యాయంగా పదోన్నతులు కట్టబెట్టి అదే అర్హతలు ఉన్న 29 సంవత్సరాల సీనియారిటీగల ఎస్జీటీలకు జీవితకాల అన్యాయం చేస్తున్నారని తమకు న్యాయం చేయాలని ఎస్జీటీలు సీఎంను కోరారు. కామన్ సీనియారిటీ ప్రకారం అర్హులైన ఎస్జీటీ, పండిత్ పీఈటీలకు అందరికి అవకాశం కల్పించేలా చూడాలని కోరారు. జిల్లా నుంచి ఎస్జీటీ నాయకులు వెంకటరమణ, సాయిలు, మోహన్, నర్సయ్య, తదితరులు హైదరాబాద్ వెళ్లిన వారిలో ఉన్నారు.

చరిత్రను అధ్యాయనం చేయాలి

●బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండివెంకట్



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దబజార్, జూన్ 16: చరిత్రలో ఉత్పత్తిజాతులైన బహుజన చరిత్రకారుల చరిత్ర మరుగున పడిపోతున్న నేపథ్యంలో ఆయా బహుజన శ్రామిక కులాల విద్యావంతులు చరిత్రను అధ్యాయనం చేయాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండివెంకట్ అన్నారు. ఆదివారం నగరంలోని చంద్రశేఖర్ కాలనీలోగల బైపాస్‌పార్క్ వద్ద అన్నభావు సాఠే స్మారక చిహ్నం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాలను ప్రచారం చేసిన మహోన్నత వ్యక్తి అన్నభావు సాఠే ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 31న అన్నభావుసాఠే జయంతి వరకు జిల్లా కేంద్రంలో మహనీయుల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌పి రాష్ట్ర కన్వీనర్ సబ్బనిలత, జిల్లా కన్వీనర్ శ్రీమన్, నాయకులు సాయికాంబ్లె, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

●సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమ

బోధన్‌రూరల్,జూన్16: కార్మికుల హక్కుల కోసం సంఘటిత పోరాటాలకు అందరు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ.రమ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘటిత పోరాటాలు నిర్వహించి తమ హక్కులకై పోరాడినప్పుడే మాత్రమే సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. అందుకు కార్యకర్తలందరు కార్మిక వర్గాన్ని సన్నద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడంతో పాటు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, మౌలిక సదుపాయల అమలు జరుపడంలో ప్రభుత్వాలు, యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇది వరకు జరిగిన ఎన్నికలలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంఘటిత పోరాటాలు తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సీఐటీయూ జిల్లా నాయకులు రమేష్ బాబు, నాయకులు జంగం గంగాధర్, నన్నేసాబ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పద్మశాలి సంఘంలో ఉచిత వైద్యశిబిరం



కొనసాగుతున్న ఉచిత వైద్య శిబిరం

పెద్దబజార్, జూన్ 16: నగరంలోని గౌతంనగర్ పద్మశాలి సంఘ భవనంలో ఆదివారం గౌతమీ వినియోగదారుల సంఘం, అంకం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అంకం భానుప్రియ మహిళలకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత సమస్య ఉంటుందని వారు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించా రు. ఆరోగ్యం పట్ల అశ్రద్ధ పనికిరాదని అనారోగ్యం కలిగితే డాక్టర్లను సం ప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గుజ్జరాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు శోభ, జగదీశ్, లయన్స్‌క్లబ్ జిల్లా కార్యదర్శి యాదగిరి, దత్తాద్రి, డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధన్‌పాల్

పెద్దబజార్, జూన్ 16: ఢిల్లీలోని గోమాతి భవన్ నార్త్‌బ్లాక్‌లోని హోంశాఖ సహాయ కార్యాలయంలో తెలంగాణ నుంచి నూతనంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను ఆదివారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మోదీ 3.0లో తెలంగాణ నుంచి ఇద్దరికి అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి మోదీకి, పార్టీ పెద్దలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ధర్పల్లి, జూన్ 16 : మండలంలోని సీతాయిపేట్ గ్రామానికి చెందిన ఒడ్డెటి రవి (38) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ ఆదివారం తెలిపారు. ఈనెల 7న సాయంత్రం ఇంట్లో నుంచి బయలుదేరిన రవి తిరిగి రాకపోవడం, బంధువుల ఇండ్లు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో భార్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముప్కాల్, జూన్16: బాల్కొండకు చెందిన బోడిగంవర్ రవిబాబు(22) హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బాల్కొండ ఎస్సై గోపి తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఈనెల 11న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులకు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఆదివారం ఉదయం మృతి చెందినట్లు మృతుని తండ్రి హన్మంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాన రహదారిపై డివైడర్లు ధ్వంసం

మోస్రా,జూన్16: మండల కేంద్రంలోని నిజామాబాద్, బాన్సువాడ నాలుగు లైన్ల ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో డివైడర్ ధ్వంసం అయినా ఘటన చోటు చేసుకుంది. అర్ధరాత్రి తిరుగుతున్న మొరం టిప్పర్లే కారణం కావచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి

సుభాష్‌నగర్, జూన్ 16: విద్యుత్ వినియోగదారుల పరిష్కారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు ప్రతి సెక్షన్ సబ్ డివిజన్‌లలో ఈఆర్‌వో డివిజన్ ఆఫీస్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17న బక్రీద్ సందర్భంగా సెలవుదినం కావడంతో ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్ఈ రవీందర్ కోరారు.

మొసలి దాడితో ఆవు మృతి



మొసలి దాడిలో మృతి చెందిన ఆవు

ఏర్గట్ల, జూన్ 16: మండల కేంద్రంలో పిన్న చెరువులో ఆదివారం నీటిని తాగడానికి చెరువులోని వెళ్ళిన ఆవుపై మొసలి దాడి చేసింది. దీంతో ఆవు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మునిమాణిక్యం భూమేష్ అనే రజకుడికి చెందిన ఆవుపై ఒక్కసారిగా మొసలి దాడి చేయడంతో అక్కడికక్కడే ఆవు మృతిచెందిందని, సుమారు 70 వేల వరకు నష్టం జరిగిందని, చెరువులో మొసలి ఉన్నట్లు పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని రజకులు ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర సాహితీ పురస్కార గ్రహీతకు సన్మానం

బోధన్‌రూరల్,జూన్16: విజయసాయి పూర్వ విద్యార్థికి కేంద్ర సాహితీ అకాడమీ యువ పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డు రావడం అభినందనీయమని విజయసాయి ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, చక్రవర్తిలు అన్నారు. ఆదివారం బోధన్‌లో అవార్డు పొందిన రమేష్‌ను తల్లిదండ్రులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాహిత్య అకాడమీ భారత ప్రభుత్వం ద్వారా నిర్వహించేబడే స్వయం ప్రతిపత్తి గల సంస్థ ప్రతి సంవత్సరం మన భారతీయ భాషలలో 24భాషల నుండి మన తెలంగాణ విద్యార్థి అందులోనూ విజయసాయి విద్యార్థి గెలుపొందడం అభినందనీయమన్నారు. అవార్డు పొందిన రమేష్, కార్తిక్ నాయక్ రచించిన డావులో చిన్నకథలు పుస్తకానికి ఈ అవార్డు లభించడం గర్వకారణమని, ఆ విద్యార్థికి ఇంకా ఇంకా మరిన్ని అవార్డులు రావాలని మా పాఠశాల అధ్యాపక బృందం ద్వారా ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ అభినందనలు తెలిపారు. ఈ పురస్కారానికి మన తెలుగు భాష నుండి 9రచనలు తీసుకోగా అందులో తమవిద్యార్థి అవార్డు పొందడం గర్వకారణంగా ఉందని, మరిన్ని కీర్తి శిఖరాలను రమేష్, కార్తిక్ నాయక్ అధిరోహించాలని వారు కోరారు.

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,జూన్16: మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రాత్మక రాజరాజేశ్వర ఆలయంలో అభివృద్ధి పనులకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.30లక్షల వ్యయంతో ఆలయంలో టైల్స్ పనులతో పాటు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, లక్ష్మణ్, శ్రీనివాస్, గంగాధర్, బ్రహ్మయ్య, లింగారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూర్‌లో కూలిన పాఠశాల ప్రహరీ



కూలిన పాఠశాల ప్రహరీ

కోటగిరి,జూన్16: పొతంగల్ మండలంలోని కల్లూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రహరీ కూలిపోయింది. పాఠశాల ప్రహరీ కూలి ఆరు నెలలు కావస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చెరువు కట్టకు అనుకుని ఉంది. ప్రహరీ లేకపోవడంతో చెరువు వైపు వచ్చే మేకలు, పశువులు పాఠశాలలోకి వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఎమ్మెల్సీని కలిసిన టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్



ఎమ్మెల్సీని కలిసిన టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్

డిచ్‌పల్లి,జూన్ 16: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌ను తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన మహేశ్ కుమార్ గౌడ్‌ను ఆయన శాలువాతో సన్మానించారు. తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులకు అందుతున్న కోర్సుల వివరాలు, వర్సిటీ పరిధి, అభివృద్ధి పనులు, సమస్యలను ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అడిగి తెలుసుకున్నారని టీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయా గౌడ్ తెలిపారు. త్వరలోనే వర్సిటీని సందర్శిస్తానని ఎమ్మెల్సీ పేర్కొన్నారని సాయాగౌడ్ తెలిపారు.